# ముసిరిన చీకట్లు

—శ్రీమతి శ్రీదేవి

సూర్యుడు నిప్పుల కుంపటిలా మండిపోతున్నాడు రోహిణికార్తి ఎండలు మనుష్యుల్ని పేలాల్లా వేయిస్తున్నాయి. అంతటి ప్రకృతి తీక్షణతనూ భరిస్తూ వూరి బయట ఆరుబయల్లో గడలుపాతి పందిరివేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఊరి పెద్దలు పురమాయిస్తున్నారు, చిన్నలు అజమాయిషీ చేస్తున్నారు, డబ్బులు పెట్టిన ఆసాములు గడబిడ పడుతున్నారు. అసలు పనంటూ చేస్తున్నవాళ్ళు అలగాజనమే! వాళ్ళే శ్రమజీవులు మరి! రక్తం కరుగుతున్నది, చెమటలు కారుతున్నాయి! ఉత్సాహం వురకలేస్తున్నది! కోలాహలం చెలరేగుతున్నది! దాని కంతటికీ కారణం మంత్రిగారావూరొస్తున్నారు. ఆ మారుమూలపల్లె పేపర్లోకెక్కటం ఆయనగారి భాగ్యంవల్లనే. అది ఆయన పుట్టినవూరు. పాతిక సంవత్సరాల తర్వాత మంత్రిగారు పుట్టింరోజు పండగ చేసుకుందామని మనసు పడ్డారు. అయ్యగారి అభిమాన వర్గాలవారు ముచ్చట తీర్చటానికి ముందు కురికారు. 15 మైళ్ళ దూరంలో వున్న రైల్వేస్టేషను నుంచి రక్కస పొదలు నరికించి కాలిదారిని రహదారిగా మార్పించారు. పూర్వాశ్రమంలో మన్నుతొక్కిఅడుసులుచేసి అయ్యగారు అ దించి వుండవచ్చుగాక! ప్రస్తుత స్థానంలో మొజాయిక్ ఫ్లోరింగు మీద కాశ్మీరపు తివాచీ పరిస్తే అల్లనల్లన హుందాగా, అందంగా కాలికి నేల తగుల్తుందేమో నన్నట్టు సందేహిస్తూ నడుస్తారు. వెంకటాచలం మాష్టారులాంటి వాళ్లు రోడ్డు బాగుపడుతుందని ఆనందించారు, మున్సబు నరసింహం, కరణం పరంధామయ్య లాంటివాళ్ళు యీ మిషతో నాల్గు డబ్బులు కూడేసుకోవచ్చను కున్నారు. వాళ్ళు డబ్బు మనుష్యులు!

మంచికి, చెడుకు సంఘీభావ మెప్పుడూ లేదు! అలాగే నిస్వార్థపరునికి, దురాశావాదులకి మైత్రి పొసగదు. సింహం, మేకపిల్ల వొకే చెరువునీళ్లు తాగినా వొకేదిక్కున మాత్రం త్రాగవు.

పెద్దలకు పెద్ద, వూరిపెద్ద, కులపెద్ద నర్సింహం. భారీ శరీరం, గంభీరస్వరం, నెత్తురుచిమ్మే కళ్లు-నరసింహంగారి ఆకారం నర-సింహంలాగానే వుంటుంది. తాటాకు గొడుగు నీడలో, కొయ్య కుర్చీలో కాళ్ల ముడుచుకు కూచుని చుట్టపొగలోని ఆనందాన్ని అనుభవిస్తూ ఆజ్ఞలు జారీచేస్తున్నారు.

మంత్రిగారి పి. ఏలా, శ్రీరామచంద్రుని నమ్మిన బంటులా, పరంధామయ్య ప్రక్కనే వున్నాడు. ఎవరు యెవరికన్నా కాపురుషులో తేల్చుకోవటం చాలా కష్టం. వాళ్ళ పథకాలకు యెవరి ఆలోచన ఆధారమో కూడా చెప్పలేం' అది వాళ్ళ మిత్రత్వంలోని సీక్రెట్. సాంగత్యానికి సరిసమానులు కావాలంటారు మరి!

అలాగే శతృత్వానికి గూడా సమవుజ్జీలుండాలి. వెంకటాచలంగారు వీరిద్దరికీ యెందులోను సాటిరాలేరు. కాని నమ్ముకున్న నిజాన్ని, కట్టుకున్నకలల్ని తేలికగా దూరం చేసుకోలేని దుర్బలత్వం వారిని వేధిస్తున్నది. కరణం మున్సబులను రొష్టుపెడుతున్నది. కొలిమిలో కాల్చినకొద్దీ ఇనుము సాగుతుంది. అలాగే అడ్డంకులు కల్పించినకొద్దీ వెంకటాచలంగారి పట్టుదల దృఢతరమౌతుంది

మంచిచెడులనే వ్యత్యాసం లేకుండా, కావాలి అక్కరలేదనే ప్రసక్తి లేకుండా, పెట్టని అడ్డుగోడలా

రాహు కేతువుల్లా నిలబడతారు నర్సింహం, పరంధామయ్యలు - స్వప్రయోజనం లేనప్పుడల్లా. వెంకటాచలం గారికి, వీళ్ళకు యెప్పుడూ ప్రచ్ఛన్న యుద్ధమే.

'రోసయ్యా ! దక్షిణంవైపు బాగా దిమ్మిసకొట్టి ఎత్తుగా దిమ్మవెయ్యి. అక్కడే మంత్రిగారికి, పెద్దలకు కుర్చీలేసేది' అన్నాడు పరంధామయ్య నిశ్శబ్దాన్ని భేదిస్తూ.

నర్సింహంగారు గుహనుంచి అప్పుడే బయటకొచ్చిన బెబ్బులిలా తల విదిల్చి అన్నారు, 'దిమ్మ వెయ్యటమంటే మాటలా ? సిమెంటు కావాలి, ఇసుక కావాలి, కంకర కావాలి. అన్నీ అందుబాటులోవుంటే స్కూలికి ఒక్క గదన్నా కట్టించక పోదునా ? ఏమంటారు మాష్టారూ?' రంగంలోకి దించి మాటకలపాలని ఆయన ఆత్రుత.

మాష్టారు మితభాషి. తలపంకించి వూరుకున్నారు.

'మరి ప్లాట్‌ఫాం యెలాచేద్దాం?'

'దానికేముందయ్యా, చిన్నప్పుడు మనం నాటకాలలో స్టేజీలు చూడలేదా ? పది బల్లలు జతచేర్చి చాపలు పరిచేవారు.'

'వారెవ్వా ! మున్సబుగారి బుఱ్ఱ బుర్రేనండి' అన్నాడు పరంధామయ్య.

'బల్లలేడనుండి తెద్దుం సామీ' ప్రశ్నించాడు రోసయ్య.

'మాష్టారి స్కూలు బల్లలున్నాయిగా' అయాచిత సలహాదారు జవాబు.

'పంతులుగార్కి యేమైనా అభ్యంతరం వున్నదేమొ, సలహాసన్నాయివ్వకుండా వున్నారు' అన్నాడు నర్సింహం. ఆయనెప్పుడు పోట్లగిత్త తలవిసిరినట్లు మాటలు విసురుతూనే వుంటాడు.

'సమిష్టికార్యంలో అందరూ చేతనయినంత సహాయం చెయ్యాలిగాని శ్రమమీద ఫలితం మాదంటే యెల్లా' అన్నాడు పరంధామయ్య నిష్ఠూరంగా.

'ఊహ తట్టింది యిప్పుడు, ఆలోచన చెప్పిందీ మీరే, అభ్యంతరం వుంటుందేమోనని అడ్డుపుల్లవేసిందీ మీరే, ఆయనను మాట్లాడనిస్తేనా' అన్నాడు రాజు. అతను మాష్టారి శిష్యుల్లో వొకడు, కరణంగారి అల్లుడు! నిజం మాట్లాడగల నిబ్బరం వున్నవాడు !

నరసింహంగారు కొంచెం కినుకగా అన్నారు—'అయితే యేమంటారో నువ్వే కనుక్కో !'

వీటన్నిటికి దూరంగా వెంకటాచలంగారు నెమ్మదిగా, నిర్మయంగా కూర్చుని వున్నారు. ఆయనకు శుష్కప్రియాలు నచ్చవు. లేనిది వున్నట్టు, వున్నదాన్ని పదింతలుచేసి పొగడడం రాదు. అందుకే యే ఫంక్షనుకు అధ్యక్షపదవి అలంకరించలేదు. సగౌరవంగా ఆహ్వానింప బడటమే తప్ప పూలమాలాంకృతులు కావటంగాని, పుష్పగుచ్ఛాలు పట్టుకుని ఫొటోలు దిగటం గాని ఆయన జీవితకాలంలో సంభవించలేదు. ముస్ముందు జరుగుతుందన్న సూచన లేమాత్రంలేవు. ఇవి ఆయన వుదాశీనతకే తార్కాణం గాని, వుపేక్షాభావానికి కాదు.

'నే నిక్కడే వున్నాగా నర్సింహంగారూ, మధ్యలో మూడోమనిషి రాయబారం దేనికి! బల్లలు తెప్పించండి' అన్నారు వెంకటాచలంగారు. నిష్ఠురతనూ పట్టించుకోలేదు, పొగడ్తనూ పట్టించుకోలేదు. 'మీ రనేమాట మాకు తెలియకినా పంతులుగారూ? యేదో వూసుపోక పరాచకాలాడతాం గాని' అన్నాడు పరంధామయ్య క్రిందకైన చేతిని జాణతనంగా పైకి చెయ్యాలని చూస్తూ

'మీరు అనతగ్గవారు, మేము తల వంచవల్సిన వాళ్ళం'

నర్సింహంగారు కల్పించుకుని అన్నారు, 'కరణంగారిని మునగచెట్టెక్కిస్తున్నారు.'

'అబ్బే చెట్టెక్కించే వుద్దేశ్యమే లేదునాకు. పెద్దల సెలవైతే యింటికెళ్ళి బల్లల సంగతి చూస్తాను'

అన్నారు సంభాషణ పెంచటం యిష్టంలేని వెంకటా చలంగారు.

'చాలా మటుకు యేర్పాట్లన్నీ అయినాయి. మీ కెందుకింకా శ్రమ, పదండిమాష్టారూ' అన్నాడు రాజు.

అప్రియ సంభాషణ చెవులకింపుగా వుండదు, మనస్సుకు ఆహ్లాదాన్నివ్వదు.

'మాష్టారొక్కరే శ్రమపడుతున్నట్టు మేమంతా తీరి కూర్చుని సేద తీర్చుకుంటున్నట్టు, మాట్లాడతావేం రాజు?'

'మీ కందరికి శ్రమకుతగ్గ ఫలితం దొరుకుతుంది మామయ్యా! ఆయనకు శ్రమ, మాటలు మాత్రమే మిగుల్తాయి. అందుకని...'అన్నాడు రాజు మాష్టారికి చెయ్యి వూతంగా యిస్తూ.

'పరంధామయ్యా! జమాఖర్చులు అణాపైసలతో సహా లెక్కలు వ్రాయమన్నాను. వ్రాస్తున్నావా?'

'చిత్తం! తమ మాటను జవదాటుతానా ?'

'చూశావా! నీ అల్లుడే నీ నిజాయితీని శంకిస్తు న్నాడు. ఊరివారి సొమ్ము దోచుకుని బంగళా కట్టిస్తా వేమోనని భయపడుతున్నాడు.'

'రాజు ఆఫీసరయినా మోట దూకుడు తగ్గలేదు. మాష్టారిమీద మమకారం తరగలేదు. నా మనస్సు నొవ్వకూడదని అందర్నీ దూరంగా నెట్టుతాడు. చిన్న వాడు, అతని మాటలు మనస్సులో పెట్టుకోకండి. పద నాయనా' అంటూ అడుగు ముందుకు వేసారు వెంకటా చలంగారు.

మామిడి తోరణాలు, రంగుల కాగితాలు పందిరి నిండా అలంకరించారు. మైకు వచ్చింది. ఒక పక్కన రికార్డులు పెడ్తున్నారు. ఊరంతా ఆనందం వెల్లివిరు స్తున్నా మాష్టారికి మామూలుగానే వున్నది. రేపటికెవ రికి ఈ వుత్సాహం వుండను. వెలవెల బోతున్న వాతా వరణం, అలసటవల్ల స్తంభించి పోయినట్టవుతుంది. నిన్నటి వింతను చిలవలు పలవలుచేసి చెప్పుకుని కొన్నాళ్ళు వినోదిస్తారు. తర్వాత యెవరి దినచర్య వాళ్ళకు మిగుల్తుంది. ఎవరి కష్టాలు వారివి, ఈ రోజు కనిపించిన సఖ్యత, సంఘీభావం మళ్ళీ మచ్చుకైనా వుండవు. కరణం, మున్సబు వచ్చినంత వూరివాళ్ళ దగ్గర లాగకామానరు, వాళ్ళొచ్చి తన దగ్గర చెప్పు కోకా మానరు. తను తీర్చలేని సమస్యలు, తనకు అనువుగాని పరిస్థితులు! అన్యాయాన్ని చూస్తూ, అనుభవిస్తూ కూడా యేమీ చెయ్యలేని అసమర్థత. ప్చ్...నిస్సత్తువ...' దీర్ఘాలోచనలోపడ్డారు మాష్టారు.

మౌనాన్ని చీలుస్తూ అన్నాడు రాజు—'మీతో నడుస్తూ మీ మాటలు వినకపోతే యేదోకొరవడినట్టుగా వుంటుంది. ఏదయినా చెప్పండి మాష్టారూ!'

'స్కూలు గురించి ఆలోచిస్తూ నీ సంగతే మర్చి పోయాను రాజూ.'

'గోడలు కప్పు యెత్తువరకూ లేచాయిట కదా మాష్టారూ? మీ శ్రమ ఫలించి, కలలు నిజాలుగా మీ కళ్ళెదుట నిలబడబోతున్నాయి.'

మాష్టారు ఆశ్చర్యంగా వింటున్నారు.

'నా చిన్నప్పుడు మీరు వీధిబడిలో చదువుచెప్పారు. ఇప్పుడు పాకలో చెప్తున్నారు. మరికొద్ది రోజులు ఓపికపడితే బిల్డింగులోనే చెప్పచ్చు.'

'రాజూ! నీ వుత్సాహాన్ని చంపటం నా కిష్టంలేదు. కాని బడి గోడలు కప్పువరకూ లేచినసంగతి నీకెవరు చెప్పారు' అని ప్రశ్నించారు. 'నువ్వీ వూరు వచ్చి నాలుగు నెలలు దాటిందికదూ! యేది చెప్పినా నమ్ము తావు. స్కూలుకని కేటాయించిన జాగాలో పునాది రాయి నాటిన తర్వాత యేపనీ జరగలేదు. నా అంచనా ప్రకారం జరగదుకూడా.'

'అదేమిటి మాష్టారూ? సిమెంటు, ఇసుక, ఇటుక లకు డబ్బు మంజూరైంది. వూరి పెద్దలకు ముట్ట చెప్పటమూ అయింది. రేపు రాత్రికి మరో పదిబస్తాల సిమెంటు కిష్టయ్య గోడౌనునుంచి వస్తున్నది' అన్నాడు రాజు ఆశ్చర్యంతో తల మునకలౌతూ.

'సిమెంటు దిగుమతి బడికోసం కాదు రాజూ ! నరసింహంగారి యింటికెడుతుంది.'

'మీరు చూస్తూ యెలా వూరుకుంటున్నారు?' నిలదీశాడు.

'నేనేం చెయ్యగలను రాజూ? కొండను ఢీకొనడానికి మూషికానికి సాధ్యమంటావా?'

'నేను పంపిన 500 రూ॥ల పుస్తకాలు మీకు చేరాయా ?'

'నాకు చేరకుంటేనేం రాజూ సురక్షితమైన ప్రదేశానికే చేరాయి. పరంధామయ్యగారి పడకగదిలో పదిలంగా వున్నాయి.'

'అలాగా' అన్నాడు సాలోచనగా. "స్కూలుకోసం పంపిన పరికరాలు ఎవరికీ వుపయోగపడని వస్తువులు స్కూలుని వెతుక్కుంటూ వస్తాయి నాయనా! స్కూలుని గురించిన తాపత్రయం మానుకో! అది సర్వవిధాలా లాభదాయకం. పెద్ద స్కూలు వస్తే పెద్దచదువులు వస్తాయి. చదువులొస్తే పల్లెవాళ్లు తెలివి తెచ్చుకుంటారు. అప్పుడు పెద్దవాళ్ళ ఆట కట్టవుతుంది."

'మాస్టారూ! కరటక దమనకుల్లా యీ శనిగాళ్ళెక్కడ దాపురించారండి ఎంతమంది కడుపులు కొడతారు? కమీషను ముట్టినా బడికి అడ్డుతగలటం మానకుంటే మరో వుపాయం ఆలోచించాలి.'

'రాజూ తొందరపడకు ఎవరితోనూ ఘర్షణ పడకు' అన్నారు మృదువుగా చేతిని నొక్కి వదులుతూ.

మాటల్లో పడి యెదురుగా వస్తున్న వ్యక్తిని వాళ్లు గమనించనే లేదు.

అజానుబాహువు చేతులెత్తి 'నమస్కారం మాస్టారూ' అన్నాడు

'చిరంజీవ' అని దీవించారు వెంకటాచలం గారు.

మాస్టారు ఆగంతకుణ్ణి చూస్తూ ప్రశ్నించారు.

'ఎవరు నాయనా నువ్వు?'

'రామాన్ని మాస్టారూ, మీ రామాన్ని !' ఉత్సాహంగా చెప్పాడు.

'ఏ రామానివి నాయనా ? కళ్ళీమధ్య బొత్తిగా ఆనటంలేదు.'

'నరసింహంగారి రామం మాస్టారూ! మన దుడుకు పిండం.'

'నువ్వా రామం' అంటూ అక్కున జేర్చుకున్నారు. 'నిన్ను చూసి సంవత్సరం పైన దాటింది. ఇంత వరకూ రాకుండా పుట్టిన వూరును, స్నేహితుల్ని మర్చిపోయావా ?'

'మిత్రుల్ని దూరంచేసుకుందామనిగాదు మాస్టారూ. ఇక్కడి వాతావరణంలో యిమడలేక పారిపోతున్నాను. ఎదురు నిలిస్తే రక్తపాతం తప్పేటట్టు లేదు.'

'రామం ! నాయనా ! నిన్ను కన్నబిడ్డలా వాత్సల్యంగా చూసుకున్నాను' నా శిక్షణలో నిన్నొక వుత్తముడిగా తీర్చిదిద్దాననుకున్నాను. నాకు తలవంపులు తెచ్చే పనులేవీ యెప్పుడూ చెయ్యనని మాటివ్వు.'

'నా మీద నమ్మకం వుంచండి మాస్టారు అన్యాయాన్ని ప్రతిఘటించటమే తప్ప నాకు వేరే వుద్దేశ్యమేం లేదు. సాగినంత వరకూ నేనెవర్ని మాటనను, చెయ్యెత్తను' అన్నాడు మాస్టారి చేతులు పుచ్చుకుంటూ

వెంకటాచలం గారికి శిష్యులందరి మీద పుత్రవాత్సల్యమే కాని రామం అంటే ప్రత్యేకాభిమానం చిన్నప్పటినుంచి. అతని చురుకుదనం, కరుకుదనం ఆయనకు ముచ్చటనిపిస్తాయి. అతని దుడుకుదనం ఆయనకు దుఃఖాన్నిస్తుంది. ఎప్పటికప్పుడు కంటికి రెప్పలా కాపాడుకుంటుంటారు.

"రామం ! మాస్టారి సుందరస్వప్నం బడి పునాదుల్లోనే కప్పిడిపోతున్నది. అది ఆయన కెంత ఖేదాన్నిస్తుందో నీకు తెల్సు'' అన్నాడు రాజు.

'విన్నాను రాజూ ! అందుకే రెక్కలు కట్టుకువాలాను. బడి గోడలు పది రోజుల్లో లేవకుంటే పెద్ద

వాళ్లు కట్టించుకుంటున్న బంగళా బుల్‌డోజరుతో బద్దలుకొట్టించేస్తాను. అఘాయిత్యాలకైనా అంతు వుండాలి,' అన్నాడు రామం ఆవేశంతో వూగిపోతూ.

'రామం! ఆవేశాలు, కావేషాలు పనులు చెడగొట్టా యయ్యా. ఈ వార్త నీ చెవిని పడకుండా వుండా లని పరమాత్ముడిని వేడుకొన్నాను. నా వేడికోలు, విన్నపాలు అంతదూరం వెళ్ళనేలేదు. నువ్వు దిగ బడ్డావు.'

'సారీ మాష్టారూ! మీ అహింసావాదం నేనుమధ్య మధ్య మర్చిపోతూ వుంటాను. ఏమయినా సరే బడి విషయం ఖరాఖండిగా తేల్చుకోందే నేను మళ్ళీ వుద్యో గానికెళ్ళను. ఈ విషయంలో మీరు నన్నాపితే, నా చేతులు కాళ్ళు విరగ్గొట్టినట్టే!'

'నాయనా ప్రతిద్వంద్వులు నీకు కావల్సినవాళ్లు.'

'రక్తసంబంధం అని అన్యాయాన్ని సహించేకంటే ప్రాణాన్ని వదలడమే నయం మాష్టారూ!'

'శత్రువులు బలవంతులు నాయనా'

'కుతంత్రులెప్పుడూ బలవంతులే మాష్టారు. ధైర్యంతో ఎదురు నిలబడాలి గాని మూర్ఖుల్లా, అస మర్థుల్లా, చేతులు ముడుచుకు కూచుంటామా! న్యాయాన్ని నిలబెట్టాలి మాష్టారు.'

'రాజూ! రామం చాలా పట్టుదలగా వున్నాడు. కొంచెం నచ్చచెప్పు. నాయనా, మీకేం హాని జరిగినా నేను చూడలేను' అన్నారు బేలగా.

'పిరికిమందు నూరిపొయ్యకండి మాష్టారూ. రామం లాంటి వాళ్లు నడుం కట్టకపోతే సమాజంలో చీడ పురుగులు బలిసిపోతాయి. అన్యాయానికి హద్దులు వుండవు!'

'ఒకరికిద్దరు తోడయ్యారా? సరే! జాగ్రత్త! సింహంతో ఢీకొంటున్నారు' అన్నారు మాష్టారు చేసేదేంలేక.

'సింపుల్ మాష్టారూ. ఈ రోజు రాత్రికి వచ్చే సిమెంటు బస్తాలని ప్రెసిడెంటు గారి గోడౌను చేర కుండా ఆపుచేస్తాం అంతే. ఇది రెండవ కంటివాడికి తెలియాల్సిన పని లేదు' అన్నాడు రామం.

'ఒక్కగానొక్క వంశాంకురానివి. తల్లిలేని వాడివి. తండ్రి యెలాంటి వాడైనా పూజనీయుడు. అయనతో పేచీలకు దిగకు రాముం!'

మాష్టారూ మావి భిన్నధృవాలు, ఎప్పుడో వొక ప్పుడు ఘర్షణ తప్పదు.'

మాష్టారు మరింక వాదించలేదు. తండ్రీ కొడుకుల మధ్య నున్న ద్వేషం యెరుగనిది కాదు. నరసింహం గారికి పోటీగా నిలవాలంటే ఆయన కొడుకు రామమే సమర్థుడు.

రాజు, రామం మాష్టారివద్ద సెలవు తీసుకుని వూరి కేసి బయల్దేరారు. నాలుగు రోడ్లు పెళ్ళికళతో కలకల లాడుతున్నాయి. ఎవర్ని చూసినా నూతనోత్సా హంతో పరుగులు పెడుతున్నారు.

'మంత్రిగారి రాక వింత వింత పరిణామాలను తెస్తు న్నది' అన్నాడు రామం.

'ఈ రోజు అమావాస్య కదూ పుంత దగ్గర కాపేస్తే సిమెంటు బండీని అటకాయించవచ్చు' అన్నాడు రాజు.

'ఓహో నవ్వింకా దాని గురించే ఆలోచిస్తున్నావా? అంతా నాకొదిలెయ్. మా పాలేరు రంగన్న నాకంతా చెప్పాడు నేను ప్లాను వేసుకున్నాను. నువు నిశ్చిం తగా నిద్రపో.'

'అదేం కుదరదు. నువ్వెక్కడికెడితే నేనూ అక్కడికే వస్తాను.'

'అవసరంలేదు రాజూ బండిని మళ్ళించడమేకదా!'

'అవసరం వున్నదీ, లేనిదీ నాకు తెలియదు. నేను మాత్రం యీ రోజుకు నీ నీడని! నువ్వు అవునన్నా కాదన్నా' అన్నాడు.

* * *

సూర్యాస్తమానమయిన గంటకే ఆకాశం నిండా చిక్కని చీకట్లు కమ్ముకున్నాయి. నలువైపుల నుంచి

నల్లని మబ్బులు కూడా పురకలేసుకుంటూ వచ్చాయి కీకారణ్యంలా అల్లుకున్న రబ్బరు తీగిలోంచి మిణుగురు పురుగులు అక్కడోటి, అప్పుడోటి కనిపించి క్షణంలో మాయమవుతున్నాయి. మర్రిచెట్లు వూడలు దించుకుని జుట్టు విరబోసుకున్న భూతాల్లావున్నాయి. రోడ్డు కిరువైపులా వున్న ముళ్ళ తుప్పలు, రాళ్ళ గుట్టలు రాత్రిని మరింత వికృతం చేస్తున్నాయి. రామం, రాజు రోడ్డు కవతలగా చింతచెట్టునీడలో మాటేసుకు కూర్చున్నారు. అర్ధరాత్రి దాటిన చాలా సేపటికి ఎడ్ల మెడలో చిరుగంటలు మ్రోగాయి. మెల్లగా బండిని లాగుతున్నాయి ఎడ్లు. బండివాడు పాగానీడలో కునుకుతున్నాడు.

రామం చెట్టునీడలోంచి రోడ్డుమీదకొచ్చి ఎడ్ల పగ్గాలను పట్టుకున్నాడు. బండివాడు వులిక్కిపడి లేచాడు. త్రాగిన మైకంలో వాడికి మానవాకారాలు స్పష్టంగా కనబడటం లేదు.

'బండిలో యేముంది?' రామం కరుగుగా ప్రశ్నించాడు.

'సిమెంటెహె'

'ఎవరిదీ సిమెంటు?'

'ప్రెసిడెంటుగారిది.'

'కాదు. బండి మళ్ళించి స్కూలు ఆవరణలో ఆపు.'

'నాకు హుకుంలు చెప్తున్నావ్.ఎవడివెహె.' చర్నాకోల పైకి లేచింది. రామం చర్నాకోల పట్టుకుని బండి వాణ్ణి క్రిందకు పడలాగాడు. రాజు మరుక్షణంలో బండిని అడ్డుత్రోవకు మళ్ళించాడు. తుప్పల వెనక నుంచి యిద్దరు మనుష్యులు ముందుకి దూకారు. కర్రలు కలిసాయి రక్తం పారింది, నడుములు విరిగాయి. చిమ్మ చీకటిలో మనుష్యుల మొహాలు కనపడటం లేదు. తన పక్షమో శత్రుపక్షమో తెలియకుండా మోకాళ్లు విరిగాయి. దెబ్బల ధాటికి తట్టుకోలేక రెండు ఆకారాలు నేలకొరిగాయి. అప్పుడు అజానుబాహువులా వున్న ఆకారం చేతులు దులుపుకుంటూ అన్నది, 'రోశయ్యా! వెధవల్ని యీడ్చి తుప్పలోకి తొయ్యి. నన్నే ప్రతిఘటిస్తారు.'

'అయ్యా! తమరోచెయ్యి వెయ్యాల ఈ డెవడోగాని చాలా బరువుగున్నాడు' అన్నాడు రోసయ్య కాళ్ళుబట్టి మట్టిలో యీడుస్తూ.

'ఏందోయ్! రాచమర్యాదలు జరుపుతున్నావు పీనుగులికి. లాగి పారెయ్యక' అన్నది మొదటి కంఠం సింహనాదంలా ధ్వనిస్తూ.

లాంతరు ఒకచేత్తో కర్ర మరోచేత్తో పట్టుకుని రహదారిలో నుంచి వస్తున్న మాష్టారు 'రామం! రామం!' అంటూ పిలిచాడు. ఆయన గొంతులో ఆవేదన, ఆదుర్దా, భయం, ఆందోళన కొట్టుమిట్టాడుతున్నాయి. దూరంనుంచి ఆయనకు కర్రల చప్పుళ్ళు ఆర్తనాదాలు వినిపించాయి..........

దూరంనుంచి మంత్రిగారి పుట్టినరోజు పండగ ఏర్పాట్ల కోలాహలం జోరుగా వినిపిస్తూ ఉంది.